క్లుప్తంగా

ఘనంగా పోచమ్మ బోనాలు



బోనాలతో వెళ్తున్న మహిళలు

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలంలోని హన్మాజిపేటలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా పోచమ్మ, పెద్దమ్మ బోనాల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు నెత్తిన బోనాలతో డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి తరలివెళ్లారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో దొడ్లకాడి చిట్టి సభ్యులు, మున్నూరు కాపు సంఘ సభ్యులు, గ్రామస్తులు జంకె పర్శరాములు, ఎల్లాల తిరుపతిరెడ్డి, కొమ్ము రాజిరెడ్డి, నాంపల్లి లచ్చయ్య, షేరి రాజిరెడ్డి, పర్శరాములు, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం వారు మాట్లాడారు. ఈ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థి రాజేందర్‌రావు భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమన్నారు. ఓటమి భయంతో ఓటర్లకు ఎన్నికకు ఒక్కరోజు ముందు బీఆర్‌ఎస్ నాయకులు మద్యం, డబ్బులు పంపిణీ చేశారని ఆరోపించారు. ఓటర్లను ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా కాంగ్రెస్‌కే మద్దతు తెలిపారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఇదే ఒరవడితో పనిచేయాలని కోరారు. సమావేశంలో నాయకులు వెంకట్ రెడ్డి, గౌస్, లింగంగౌడ్, గిరిధర్‌రెడ్డి, రాజునాయక్, రవి, రఫిక్, రాంరెడ్డి, కృష్ణమూర్తి, రాజయ్య, రవీందర్ రెడ్డి, మల్లారెడ్డి, దేవయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

బెరడు తొలగిస్తూ.. చెట్లను ఎండగొడుతూ



ధర్మారంలో బెరడు తొలగించిన చెట్టు

కోనరావుపేట: ప్రధాన రహదారిపై కనువిందు చేస్తూ బాటసారులకు నీడనిస్తున్న చెట్లను కొందరు ఎండగొడుతున్నారు. మండలంలోని ప్రధాన రహదారిపై కొన్ని నెలలుగా ఈ పని కొనసాగుతోంది. ఇంటికి దగ్గరగా ఉందనే కారణంతో చెట్టును తొలగిస్తే అధికారులు జరిమానాలు విధించి కేసులు నమోదు చేస్తారన్న భయంతో కొందరు చెట్టు మొదట్లో చుట్టూ బెరడును తొలగిస్తున్నారు. ఇలా తొలగించిన చెట్టు క్రమంగా ఎండిపోతుంది. తర్వాత ఎండిపోయిందని ప్రమాదకరంగా ఉందంటూ దర్జాగా కొట్టేస్తున్నారు. మండలంలోని గ్రామాల్లో కొన్ని నెలలుగా ఈ వ్యవహారం కొనసాగుతుందని పలువురు పేర్కొన్నారు.

మరమ్మతులు చేపట్టాలి



బోయినపల్లి: మండలకేంద్రం నుంచి వేములవాడ వెళ్లే బీటీ రోడ్డులో స్తంభంపల్లి గ్రామ పరిసరాల్లో రోడ్ కట్ కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వేగంగా వచ్చే వాహనాలు రోడ్ కట్ అయిన చోట స్కిడ్ అవుతున్నట్లు ప్రయాణికులు వాపోతున్నారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు రోడ్డు మరమ్మతు పనులు చేయాలని కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణంలోని మొదటి బైపాస్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి ఆటో డివైడర్‌ను ఢీకొట్టి బోల్తాపడింది. ఈ సంఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు మహిళలకు స్వల్ప గాయాలయ్యాయి.

గాలి వీచిందా.. కరెంట్ గోవింద

- చిన్న గాలివానకే విద్యుత్ కట్
- ఓవర్‌లోడ్‌తో తరచూ సరఫరాలో అంతరాయం
- మరో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని ప్రజల విజ్ఞప్తి



నాంపల్లిలోని విద్యుత్ సబ్‌స్టేషన్

వేములవాడఅర్బన్: చిన్న గాలివానకే విద్యుత్ తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం... మళ్లీ ఎప్పుడొస్తుందో తెలియని పరిస్థితి. ఇలా నిత్యం విద్యుత్ సమస్యతో వేములవాడ అర్బన్ మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేములవాడ అర్బన్ మండలానికి 11 గ్రామాలు, ఒక్క మున్సిపల్ పరిధిలోని నాంపల్లి, నాంపల్లి శివారులోని 7 ఆమ్లెట్ పల్లెలు గురువయ్యనగర్, శివపార్వతుల కాలనీ, శాలరామన్నపల్లి, శాంతినగర్, బొజ్జపల్లి, ఇస్లాంనగర్, గోల్లపల్లెలకు ఒక 33/11 కేవీ సబ్‌స్టేషన్ మాత్రమే ఉంది. నిత్యం ఓవర్ లోడ్‌తో గంటకోసారి కరెంట్ పోవడం, ఒకే సబ్‌స్టేషన్ ఉండటంతో గ్రామాల్లో విద్యుత్ మరమ్మతు కారణంగా సబ్‌స్టేషన్‌లో విద్యుత్ బంద్ చేస్తున్నారు. దీంతో అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుండటంతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం, సెస్ అధికారులు స్పందించి మరో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

2 గ్రామాలు, 7 పల్లెలు..

వేములవాడ అర్బన్ మండలంలోని సంకెపల్లి, ఆరెపల్లి, రుద్రవరం, అనుపురం, కొడుముంజ, శాభాష్‌పల్లి, చింతాల్‌ఠాణా, మారుపాక, గుర్రవానిపల్లి, చంద్రగిరి, చీర్లవంచ గ్రామాలతో పాటు నాంపల్లి మున్సిపల్‌కు 7 పల్లెలకు కలిపి నాంపల్లిలో 33,11 కేవీ సబ్‌స్టేషన్ ఉంది. సబ్‌స్టేషన్‌తో ఇండ్రస్టీయల్స్, సిమెంట్ బ్రిక్స్‌లు, క్రేషర్లు, రెండు జిన్నింగ్ మిల్స్, గృహాలకు, వ్యవసాయ బావులకు, అగ్రహారంలోని ఎస్‌ఆర్‌ఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు, జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలకు, డెయిరీ ఫాంలు, ఫౌల్ట్రీ ఫామ్‌లు, అంజన్న ఆలయం, నాంపల్లి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం, వేములవాడ ఆర్టీసీ డిపోకు ఇలా అన్ని అవసరాలకు సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్‌ను వాడటంతో ఓవర్‌లోడ్‌తో విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని సెస్ అధికారులు చెబుతున్నారు.

ముంపునకు గురైంది.

రుద్రవరంలో గతంలో 33/11 కేవీ సబ్‌స్టేషన్ ఉంది. మిడ్‌మానేరు ముంపు గ్రామం కావడంతో అది ముంపులో మునిగింది. కానీ సబ్‌స్టేషన్‌కు మాత్రం స్థలం సేకరించకపోవడంతో ఇప్పటివరకు వాయిదా పడింది. గతంలో సబ్ స్టేషన్ ఉన్నప్పుడు సంకెపల్లి, రుద్రవరం, ఆరెపల్లి, నాంపల్లి సగభాగం విద్యుత్ సరఫరా అయ్యేది. ఇప్పుడు రుద్రవరం, అనుపురం గ్రామాల మధ్యలో నూతన సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతం ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుతుందని గ్రామాలప్రజలు కోరుతున్నారు.

చిరుజల్లులకే పోతోంది



ఇటీవల గాలిదుమారంతో కురిసిన చిన్న చిరు జల్లులకు ఒక్క రోజు మొత్తం కరెంట్ పోయింది. గాలి వీస్తే చాలు చీకట్లోనే ఉండే పరిస్థితి. అధికారులు పట్టించుకొని మరో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలి.

– భూముల మల్లేశం, నాంపల్లి

పట్టించుకోవడం లేదు



సబ్ స్టేషన్ ఏర్పాటు చేసి ఈ ప్రాంతం ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. చిన్నగాలికి కరెంట్ పోతే ఎప్పుడు వస్తుందో తెలియదు. ఇప్పటికైనా సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలి.

– బుర్ర శేఖర్, సంకెపల్లి

వానాకాలంలో ఇబ్బంది



ఇప్పుడే ఇలా కరెంట్ వస్తూ పోతుంటే.. వచ్చే వానాకాలంలో విద్యుత్ నిరంతరంగా సరఫరా చేస్తారని నమ్మకం లేదు. అధికారులు వర్షాకాలం ప్రారంభం వరకు అయినా నూతన సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలి.

– జంగం గంగరాజు, గొల్లపల్లె

చౌడాలమ్మ ఆలయంలో కేటీఆర్ పూజలు



ముస్తాబాద్: ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కేటీఆర్


ముస్తాబాద్: మండలంలోని కొండాపూర్‌లో చౌడాలమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో మాజీ మంత్రి కేటీఆర్ మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. మ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. నాలుగు రోజులపాటు జరిగే ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశామని శ్రీ కృష్ణ యాదవ సంఘం తెలిపింది. కేటీఆర్‌ను సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు.

దర్గావలి దర్గాలో ప్రార్థనలు

ఎల్లారెడ్డిపేట: దర్గావలి దీవెనలతో జిల్లా ప్రజలు సంతోషంగా ఉండాలని ఉండాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. మండలంలోని సింగారంలో దర్గావలి గుట్టపై దుర్వేషావలి దర్గా ఉర్సు ఉత్సవాల్లో భాగంగా దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ తమ ప్రభుత్వ హయాంలో దర్గావలి గుట్టను అన్ని హంగులతో సుందరీకరించామన్నారు. ఉత్సవ నిర్వాహకులు షేక్ అజీజ్ కేటీఆర్‌కు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ వరస కృష్ణహరి, నాయకులు అందె సుభాష్, నర్సాగౌడ్, దేవరాజు, స్వామిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

‘చెట్టంత’ నిర్లక్ష్యం..

గంభీరావుపేట: నిత్యం అధికారులు ఉండే చోటు. కళ్ల ముందే కార్యాలయ గోడలపై చెట్లు పెరిగి గోడలు పగుళ్లు చూపుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. డ్రైనేజీ పైపులైన్ ధ్వంసమైనా పట్టించుకోవడం లేదు. గంభీరావుపేట మండల పరిషత్ కార్యాలయ భవనంపై చెట్లు పెరుగుతున్నాయి. వాటిని తొలగించడంలో అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు. ఫలితంగా భవన గోడలకు ముప్పు పొంచి ఉంది.



తేనెటీగల దాడిలో ఒకరికి గాయాలు



భూమేశ్‌ను పరామర్శిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగుండారం గ్రామంలో మంగళవారం కోట బురుజుపైకి ఎక్కిన కాంగ్రెస్ నాయకుడు, అడ్వకేట్ పిట్టల భూమేశ్‌పై తేనెటీగలు దాడి చేశాయి. తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరుకున్న అతడిని స్థానికులు ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. రాచర్లగుండారం గ్రామంలో శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయ వార్షికోత్సవం ఉండగా, స్వామివారిని దర్శించుకున్న అనంతరం కోట బురుజును చూసేందుకు దాని పైకి ఎక్కాడు. ఈ క్రమంలో మెట్లపై ఉన్న తేనెటీగల తెట్టెను గమనించకపోవడంతో అది తలకు తగిలి వాటి గుంపు భూమేశ్‌పై దాడి చేసింది. దీంతో ఆయన స్పృహ కోల్పోయి అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే గ్రామస్తులు ఆస్పత్రికి తరలించారు. భూమేశ్‌గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ సిరిసిల్ల అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భూమేశ్‌ను బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, నాయకులు గౌస్, బండారి బాల్‌రెడ్డి, దండు శ్రీనివాస్, ఎడ్ల రాజ్‌కుమార్, జజ్జరి నర్సయ్య, శ్రీను, మధు పరామర్శించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



వెంగళరావు మృతదేహం

వేములవాడఅర్బన్: మున్సిపల్ పరిధి తిప్పాపూర్ లోని వేములవాడ- సిరిసిల్ల రహదారిలో ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో వ్యక్తి మృతిచెందాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. వేములవాడ గాంధీనగర్‌కు చెందిన వెంగళరావు (36) మంగళవారం రాత్రి ద్విచక్రవాహనంపై సిరిసిల్లకు వెళ్లి తిరిగి వస్తుండగా వెనక నుంచి కారు ఢీకొట్టడంతో స్థానికులు వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా అతడు అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు.

తవ్వారు.. వదిలేశారు !

- మిషన్ భగీరథ పైపులైన్ కోసం నాలుగు నెలల క్రితం సీసీరోడ్డు తవ్వకం
- ఇబ్బంది పడుతున్న కాలనీ ప్రజలు



మిషన్ భగీరథ పైపులైన్ కోసం తవ్వి వదిలేసిన సీసీరోడ్డు

రుద్రంగి: మండలకేంద్రంలోని 14వ వార్డు ఇందిరాచౌక్ ఆవరణలో నాలుగు నెలల క్రితం మిషన్ భగీరథ పైపులైన్ కోసం సీసీ రోడ్డును తవ్వి అలాగే వదిలేశారు. నెలలు గడుస్తున్నా మరమ్మతులు చేయక పోవడంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. పలుసార్లు సమస్యను విన్నవించినా పట్టించుకున్న పాపాన పోలేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలే సీసీరోడ్డు నూతనంగా వేశారని, సీసీ వేయకముందు మిషన్ భగీరథ పైపులైన్ వేస్తే ఎలాంటి ఇబ్బంది ఉండక పోయేదనిన్నారు. లక్షలు వెచ్చించి వేసిన సీసీరోడ్డు కాంట్రాక్టర్లు, అధికారులు పూర్తిగా ధ్వంసం చేసి ప్రజాధనం వృథా చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు మరమ్మతులు చేపట్టి ఇబ్బందులు కలగకుండా లేకుండా చూడాలని వారు కోరుతున్నారు.

బీజేపీ గెలుపు ఖాయం

ముస్తాబాద్: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ విజయం సాధిస్తారని ఆపార్టీ మండల అధ్యక్షుడు మెరుగు అంజాగౌడ్ అన్నారు. మండలకేంద్రంలో అంజాగౌడ్ మంగళవారం మాట్లాడారు. ప్రధాని మోదీకి మద్దతుగా అన్నివర్గాల ప్రజలు బండి సంజయ్‌కు ఓట్లు వేశారన్నారు. పార్టీ శ్రేణులు ప్రజల్లో ఉంటూ పనిచేశారన్నారు. పార్టీకి అండగా నిలిచారని కృతజ్ఞతలు తెలిపారు. భారీ మెజార్టీతో బండి సంజయ్ గెలుస్తారని పేర్కొన్నారు. ఓటర్లకు ధన్యవాదాలు తెలిపారు.

‘కొండూరి’ ఆటవిడుపు



గంభీరావుపేట: పార్లమెంట్ ఎన్నికల్లో బిజీగా గడిపిన నాయకులు ప్రస్తుతం కాస్త రిలాక్స్ అవుతున్నారు. మండలంలోని గజసింగవరంలో టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు మంగళవారం యువకులతో కలిసి కాసేపు ఆటవిడుపుగా క్రికెట్ ఆడి సరదాగా గడిపారు.

మహేందర్‌రెడ్డికి ఆహ్వానం

ఎల్లారెడ్డిపేట: మండలంలోని సింగారం గ్రామంలోని దుర్వేషావలి దర్గా ఉర్సుకు రావాలని కోరుతూ నిర్వాహకుడు షేక్ అజీజ్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిని ఆహ్వానించారు. మహేందర్‌రెడ్డిని మండలకేంద్రంలో మంగళవారం కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ సందర్భంగా అజీజ్ మాట్లాడుతూ బుధవారం నుంచి ప్రారంభమయ్యే వేడుకలకు చుట్టుపక్కల ప్రాంతాల వారే కాకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులు హాజరవుతారన్నారు. మహేందర్‌రెడ్డిని కలిసిన వారిలో ముస్లిం కమిటీ మండలాధ్యక్షుడు షేక్ షాదుల్లా, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, మసీదు కమిటీ ఉపాధ్యక్షుడు లాల్ మహ్మద్, తదితరులు ఉన్నారు.

అనుమానాస్పద వ్యక్తి పోలీసులకు అప్పగింత



అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి గ్రామంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తిని గ్రామస్తులు మంగళవారం పోలీసులకు అప్పగించారు. గ్రామానికి చెందిన రెడ్డి ఐలయ్య ఇంటికి వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించడంతో ఇంట్లోవారు కేకలు వేశారు. చుట్టు పక్కల వారు చేరుకొని అనుమానిత వ్యక్తిని బంధించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అనుమానిత వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ప్రమాదాలబారిన వాహనదారులు



వేములవాడ: రూ.లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన బీటీ రోడ్డును మిషన్ భగీరథ, ఓ ప్రైవేట్ సంస్థ కేబుల్ ఏర్పాటుతో పెద్ద గుంత ఏర్పడింది. దీంతో రోడ్డంతా గుంతలమయమైంది. వేములవాడ పట్టణంలోని సెస్ కార్యాలయం ముందున్న ఈ రోడ్డుపై చాలా మంది ప్రమాదాలకు గురయ్యారు. మున్సిపల్, ఆర్‌అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ రోడ్డుగుండా నిత్యం ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ పయనిస్తున్నా అధికారుల్లో మాత్రం చలనం లేకుండా పోతుంది. ఇంకా ముందుందు ప్రమాదాల జరగకముందే అధికారులు రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

‘ఉర్సు’ కోసం ముస్తాబు



విద్యుత్ కాంతుల్లో దర్గావలి గుట్ట

- నేటి నుంచి ప్రారంభం
- హాజరుకానున్న వేలాది మంది భక్తులు
- ఇతర రాష్ట్రాల నుంచి రాక
- ఏర్పాట్లు పూర్తిచేసిన నిర్వాహకులు

ఎల్లారెడ్డిపేట: చుట్టూ పచ్చని పొలాలు.. చెంతనే పారే పారేటివాగు జలసవ్వడులతో దర్గావలిగుట్ట ప్రాంతం ప్రకృతి అందాలతో విరాజిల్లుతోంది. దట్టమైన అడవిలో ఉన్న దర్గావలిగుట్టపై దుర్వేషావలి దర్గాకు శతాబ్దాల చరిత్ర ఉంది. ఎల్లారెడ్డిపేటకు చెందిన షేక్ అజీజ్ దర్గావలి గుట్టపై వెలసిన దుర్వేషావలి ఉర్సు ఉత్సవాలు నిర్వహిస్తూ ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు. బుధవారం ఉర్సు ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి.

ఇతర రాష్ట్రాలనుంచి హాజరు

మండలంలోని సింగారం గ్రామ శివారులోని దర్గావలిగుట్ట దట్టమైన అటవీప్రాంతంలో ఉంది, గుట్టపై దుర్వేషావలికి వందల ఏళ్ల చరిత్ర ఉన్నట్లు స్థల పురాణం చెబుతుంది. వేడుకలకు మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి భారీగా భక్తులు తరలివస్తారు. వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖ ముస్లిం మత గురువులు హాజరవుతారు.



కార్యక్రమాలు ఇవే..

బుధవారం ఉదయం మండల కేంద్రంలో చందల్ ఊరేగింపు. గుర్రాల బండ్లు, కళాకారుల నృత్యాలు ఆకట్టుకుంటాయి.

- చందల్‌ను ఎల్లారెడ్డిపేట నుంచి సింగారం గ్రామం వరకు ఊరేగింపుగా తీసుకెళ్తారు.
- దర్గావలిగుట్టపై వెలసిన దుర్వేషావలికి చందల్ సమర్పిస్తారు. ఈ సందర్భంగా మత గురువుల ప్రార్థనలు ఉంటాయి.
- మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.
- రాత్రి 8 గంటల నుంచి గురువారం తెల్లవారు జాము వరకు ముంబై నుంచి వచ్చిన కవ్వాలి బృందం ప్రదర్శనలు నిర్వహిస్తారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందిస్తున్న గ్రామస్తులు

గంభీరావుపేట: మండలంలోని మల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన అనాథ చిన్నారులకు గ్రామస్తులు రూ.36వేల ఆర్థికసాయం అందించారు. మల్లారెడ్డిపేటకు చెందిన గాజులపల్లి వినోద మూడేళ్ల క్రితం మృతిచెందగా ఆమె భర్త ముత్యం వారం రోజుల క్రితం మృతిచెందాడు. ఇద్దరు చిన్నారులు అనాథలుగా మారడంతో గ్రామస్తులు ఆర్థిక సాయం అందజేశారు.